
సాక్షి
అనంతపురం

గురువారం । 19 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.10 వేలు పలికాయి.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.11 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.3°/14.2°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

31 వరకు కలెక్టర్ సెలవు

- ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా శివ్‌నారాయణ్ శర్మ



అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఈనెల 31వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. ఇటీవలే ఆయన సతీమణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో కలెక్టర్ పెటర్నటీ సెలవు కోరుతూ లేఖ రాయగా, ఈనెల 31వ తేదీ వరకు మంజూరు చేస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ జనవరి 1వ తేదీన తిరిగి విధులకు హాజరవుతారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును బుధవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీల బ్యారెక్‌లు పరిశీలించారు. అదే విధంగా వంట గదులు, స్టోర్ రూమ్, బాత్ రూమ్‌లు, టాయిలెట్లు పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. 70 ఏళ్లకు పై బడిన వారు, అనారోగ్యానికి గురైన వారు ఎవరైనా ఉన్నారా అనే విషయాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ఏడీజే శ్రీహరి, జైలర్ మహేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు చేయండి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: రైతుల నుంచి రోజా ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ప్రకారం కందులు కొనుగోలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కందుల కొనుగోలు అంశంపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుల కొనుగోలు కోసం గురువారం నుంచి ఆర్ఎస్‌కేల్లో రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు. కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా డీఆర్‌డీఏ, డీసీఓ, డీసీఎంఎస్ శాఖల అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తూ కందులు కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ గోదాముల వద్ద, కొనుగోలు కేంద్రాల్లో చేపట్టే కార్యకలాపాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కందుల కోసం అవసరమైన గోనె సంచులు, రవాణా, సరుకు భద్రపరిచేందుకు గోదాములు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, డీసీఓ అరుణకుమారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సత్యనారాయణ చౌదరి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డీటీసీ వీర్రాజు, ఎస్ఈఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మామిడి' ప్రీమియం చెల్లించండి

అనంతపురం అగ్రికల్చర్: ఐదు సంవత్సరాలు, అంతకన్నా ఎక్కువ వయస్సు ఉన్న మామిడి తోటలకు వాతావరణ బీమా వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీమియం చెల్లించడానికి ఈ నెలాఖరు వరకు గడువిచ్చింది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో బీమా పథకం అమలు కానుంది. హెక్టారుకు రూ.82,500 పరిహారం ఖరారు చేసిన నేపథ్యంలో 15 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రైతులు తమ వాటా కింద 5 శాతం (రూ.4,125) భరిస్తే మిగతా 10 శాతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ఈ నెల 15 నుంచి 2025 మే 31 వరకు బీమా వర్తించే కాలంగా పరిగణించారు. ఈ మధ్య కాలంలో అకాల వర్షాలు, ఉష్ణోగ్రతలు, ఈదురు గాలులు, తెగుళ్లు ఆశించే వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోనున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా విషయానికి వస్తే హెక్టారుకు రూ.90 వేలుగా ఖరారు చేశారు. 14 శాతం ప్రీమియంలో రైతులు తమ వాటా కింద 5 శాతం చెల్లిస్తే... మిగతాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి.

అరణ్య రోదన

ఏ ప్రాంతంలో అయినా పచ్చదనం పరిఢవిల్లితేనే సమస్త జీవజాలం చల్లగా ఉంటుంది. ఎలాంటి సమస్యలూ తలెత్తవు. కానీ, జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా సమస్యలు తలెత్తున్నాయి. మానవ అనైతిక చర్యల కారణంగా పశుపక్ష్యాదులు కూడా ఇబ్బందులు పడుతున్నాయి.



మానవాళి తప్పు.. అడవులకు ముప్పు

- జిల్లాలో తగ్గుతోన్న అటవీ విస్తీర్ణం
- రాయలసీమలోనే జిల్లాలో అత్యల్పంగా అడవులు
- కొండలు, గుట్టలు అంతరించి పోతున్నా పట్టించుకునే దిక్కులేదు
- రాష్ట్రంలోనే మేలిమి పశుగ్రాసం 'ఉమ్మడి అనంత'లో లభ్యం
- జింకలు, చిరుత పులులకు పెట్టింది పేరు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అసలే కరువు జిల్లాగా పేరుపొందిన జిల్లాలో అడవుల విస్తీర్ణం రోజురోజుకూ కుంచించుకుపోతోంది. అటవీ విస్తీర్ణం పరంగా రాయలసీమలోనే జిల్లా చివరస్థానంలో నిలుస్తోంది. రోజు రోజుకూ జిల్లాలో గుట్టలు, కొండలు మాయమవుతున్నాయి. యథేచ్ఛగా అటవీ సంపదను తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరు. ముఖ్యంగా అటవీ పరిధిలోని గుట్టలను సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నా అడిగే వారు కరువయ్యారు. అడవులు తగ్గుతున్న కొద్దీ వన్య ప్రాణులు బిక్కుబిక్కుమంటూ జనారణ్యంలోకి వచ్చి ప్రమాదాలకు గురికావడం, వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకోవడం జరుగుతోంది.

వ్యవసాయ భూములుగా..

కళ్యాణదుర్గం, రాయదుర్గం, పెనుకొండ, మడకశిర వంటి కొన్ని ప్రాంతాల్లో అటవీ భూములను అక్రమంగా వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నట్టు విమర్శలొస్తున్నాయి. దీంతో రిజర్వు ఫారెస్టు విస్తీర్ణం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న అటవీ విస్తీర్ణం ఇలా ఆక్రమణలకు గురవుతుండటం కలవరపెడుతోంది. ఇప్పటికే వర్షపాతం తక్కువగా నమోదవుతున్న ఉమ్మడి జిల్లాకు... అడవుల విస్తీర్ణం తగ్గిపోతుండటం తీవ్ర నష్టం కలిగించే విషయమని నిపుణులు చెబుతున్నారు.

వన్యప్రాణులకు విఘాతం..

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కృష్ణ జింకలు, చిరుత పులుల అభివృద్ధి అనంతపురం, శ్రీ సత్యసాయి అడవుల్లోనే ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. మేలిమి జాతి పశుగ్రాసం 'ఉమ్మడి అనంత'లో లభ్యమవుతున్నట్లు ఇందుకు కారణమని తేల్చారు. ఎలుగుబంట్లు, కుందేళ్లు, కొన్ని రకాల పాములు, తోడేళ్లు, నక్కలు వంటివీ ఇక్కడ ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 3 వేలకు పైగా జింకలు ఉన్నాయని, 280 వరకూ చిరుతలు ఉన్నట్టు తాజా అంచనా. అడవుల విస్తీర్ణం తగ్గుతున్న కొద్దీ వన్యప్రాణులు రోడ్లపైకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నట్టు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో కాకుండా బయటవైపు చెట్ల పెంపకం అనుకున్నంత మేర జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడవుల విస్తీర్ణం పెరిగితే జంతుజాల సంరక్షణతో పాటు వర్షపాతం ఎక్కువగా నమోదు కావడానికి వీలుంది.

రాయలసీమ జిల్లాల్లో అటవీ విస్తీర్ణం ఇలా

జిల్లా	నోటిఫైడ్ ఫారెస్టు (చ.కిమీ)	బయట చెట్లు (చ.కిమీ)	జియోగ్రాఫికల్ ఏరియా (చ.కిమీ)
తిరుపతి	2,644.87	430.10	37.35
అన్నమయ్య	2,575.27	352.13	36.80
చిత్తూరు	1,952.69	440.42	34.91
అనంతపురం	746.61	318.83	10.44
శ్రీ సత్యసాయి	1,252.21	195.04	16.21
కర్నూలు	351.27	187.64	6.75
నంద్యాల	3,140.34	238.97	34.90

రిజర్వ్ ఫారెస్టు చాలా తక్కువ

"మిగతా జిల్లాలతో పోలిస్తే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రిజర్వు ఫారెస్టు చాలా తక్కువ. నల్లమల అడవులున్న నంద్యాల జిల్లాతో వీటిని పోల్చలేం. అటవీ సంపదను పెంచడంలో భాగంగా గత ఏడాది 120 హెక్టార్లలో మొక్కలు నాటాం. ఈ ఏడాది 80 ఎకరాల్లో మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అటవీ సందపను అక్రమంగా తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకునేందుకూ వెనుకాడం.

– విఘ్నేష్ అప్పావు, జిల్లా అటవీ అధికారి

వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు

అనంతపురం: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనంతపురం కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు... అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలలో నివాసం ఉంటున్న బత్తల శైలజ, బత్తల సురేంద్రబాబు అలియాస్ సూరి దంపతులు. పెళ్లి సమయంలో సురేంద్రబాబుకు వరకట్నం కింద రూ.లక్ష, 8 తులాల బంగారు నగలను శైలజ తల్లిదండ్రులు ఇచ్చారు. అనంతరం రూ.1.50 లక్షల అదనపు కట్నం తీసుకురావాలంటూ శైలజను శారీరకంగా వేధిస్తూ వచ్చాడు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో 2019లో అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ నాగమధు అప్పట్లో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసు వాదనలు అప్పటినుంచి కొనసాగుతూ వచ్చాయి. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి బత్తల సురేంద్రబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మొబైల్ కోర్టు జడ్జి జె.సుజిన్ బుధవారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ వి.శ్రీనివాసులు వినిపించారు.

21న హెచ్చెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక

అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా ఈనెల 21న హెచ్చెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఎన్. రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నగరంలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. 10.15 గంటల వరకూ చైర్మన్ పదవికి నామినేషన్ల స్వీకరణ, 10.30 గంటలకు నామినేషన్ల తుది జాబితా, 11.30లోపు ఎన్నికల ప్రక్రియ, 11.30 గంటలకు లెక్కింపు, చైర్మన్ ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. 12 గంటల నుంచి 1.15 గంటల మధ్య వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు వివరించారు.

భూముల మార్కెట్ విలువ పెంపు

- 1 నుంచి అమలులోకి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువ పెంపుదలకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయం ప్రజలకు తెలిసే విధంగా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు తీసుకోవాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రిజిస్ట్రేషన్ శాఖ, అహుడా, మునిసిపల్ అధికారులతో మార్కెట్ విలువ సవరణ కమిటీ జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ విలువ వివరాలు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ https://registration.ap.gov.inలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. పెరిగిన భూముల మార్కెట్ విలువకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే ఈనెల 24వ తేదీలోగా తెలియజేయవచ్చన్నారు. 27వ తేదీన నిర్వహించే సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపుతామన్నారు. పెంచిన భూముల విలువలు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయన్నారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి, అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, అహుడా కార్యదర్శి గౌరి శంకర్ రావు, సబ్ రిజిస్ట్రార్లు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ వర్గాలకు ప్రభుత్వ సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు తప్పనిసరిగా ఖర్చు చేయాలన్నారు. వారు నివాసముండే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. చౌక దుకాణాలకు శాశ్వత డీలర్లుగా ఎస్సీ, ఎస్టీ వర్గాల నిష్పత్తి ప్రకారం ఈనెల 31వ తేదీలోగా నియామకం పూర్తి చేయాలన్నారు. కాంపోనెంట్ స్కీములకు సంబంధించి అర్బన్‌లో స్లమ్ ఫెడరేషన్ ఆర్పీలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ స్కీమ్‌లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను రాబోయే మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించిన నిధుల మంజూరుకు అనుమతులు వచ్చాయన్నారు. వీటి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పాఠశాలలు, వసతి గృహాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓపై 'లోకాయుక్త'కు ఫిర్యాదు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) భ్రమరాంబ దేవిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు ఉరవకొండ సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండ రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. డీఎంహెచ్ఓపై అవినీతి ఆరోపణలను నిగ్గు తేల్చాలని లోకాయుక్తను కోరినట్లు కోదండ రామిరెడ్డి వెల్లడించారు.

అలవెన్స్ వాత... ప్రచార రోత!

- ఆర్టీసీ కార్మికుల కష్టంపై కూటమి కుట్ర
- రాత్రి విధుల అలవెన్సుల్లో సగం కోత
- అనంత రీజియన్‌లో రోజుకు 1,200 మందికి నష్టం
- కార్మికులకు ఎంతో మేలు చేసినట్లు సర్కార్ ప్రచార ఆర్భాటం
- నమ్మించి నట్టేట ముంచిన ప్రభుత్వంపై కార్మికుల పెదవి విరుపు



అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్మికులను కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. రాత్రి విధులు నిర్వర్తించగా వారికి వచ్చే అలవెన్సుల్లోనూ కోత విధించింది. కడుపుపై కొట్టడమే కాకుండా ఏదో ఉద్ధరించినట్లు ప్రచార ఆర్భాటం చేస్తుండటంపై కార్మికులు మండిపడుతున్నారు. వివరాలు.. ఆర్టీసీలో రోజూ రాత్రి విధులు నిర్వర్తించే కార్మికులకు అలవెన్సుగా రూ.300 ఇచ్చేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఇటీవలి వరకూ ఆ మేర డబ్బు అందించారు. దీంతో చిరుజీవులు ఎంతో ఊరట పొందారు.

కూటమి 'కట్'కటా..

ఇటీవల ఎన్నికల సమయంలో సాంకేతిక కారణాలతో అలవెన్స్ బిల్లులు నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై శీతకన్ను వేసింది. అలవెన్సు డబ్బు అందించాలంటూ ఆరు నెలలుగా కార్మికులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే గతంలో రూ. 300 ఇచ్చే అలవెన్సును రూ.150కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓ విడుదల చేసింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులకు రాత్రి విధుల అలవెన్సులు రూ. 60 లక్షలు అందాల్సి ఉండగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అదికాస్త రూ.30 లక్షలకు చేరుకుంది. అరకొర ఆదాయాన్ని కూడా ప్రభుత్వం లెక్కగట్టి తగ్గించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

వందల మందిపై ప్రభావం..

అనంతపురం ఆర్టీసీ రీజియన్‌లో రోజూ సుమారు 1,200 మంది కార్మికులు విధుల్లో ఉంటున్నారు. రాత్రి వెళ్లే బస్సుల (నైట్‌హాల్ట్)కు గాను అలవెన్సు కింద డబ్బు అందుకునేవారు. ఇందులో డ్రైవరుతో పాటు కండక్టరు, గ్యారేజీ సిబ్బంది కూడా ఉన్నారు. అధికారంలోకి రాగానే జీవితాల్లో వెలుగులు నింపుతామని మోసపూరితమైన హామీలిచ్చిన చంద్రబాబు... కొత్త పథకాలు అమలు చేయలేదు సరికదా, ఉన్నవాటికీ నేడు కోత పెడుతుండటంపై కార్మికులు మండిపడుతున్నారు. సర్కారు అన్యాయంపై గళం విప్పాలని చూసిన కార్మికులపై ఆంక్షలు విధించినట్లు వారు చెబుతున్నారు. తమ ఆవేదనను కనీసం మీడియాకు చెప్పేందుకు కూడా జంకుతున్నారు.

'రబీ' @ 80 వేల హెక్టార్లు

- గరిష్టంగా 62 వేల హెక్టార్లలో పప్పుశనగ సాగు

అనంతపురం అగ్రికల్చర్: రబీ మందకొడిగా 'సాగు'తోంది. అధికారులు అంచనా వేసిన 1,18,330 హెక్టార్లకు గానూ ప్రస్తుతానికి 80 వేల హెక్టార్లలో పంటలు వేశారు. నల్లరేగడి భూములు కలిగిన మండలాల్లో ప్రధానపంట పప్పుశనగ 72,900 హెక్టార్లకు గానూ గరిష్టంగా 84 శాతంతో 62 వేల హెక్టార్లలో సాగు చేశారు. ఇప్పటికే పప్పుశనగ సాగుకు సమయం ముగిసింది. ఇక విస్తీర్ణం పెరిగే పరిస్థితి లేదంటున్నారు. మరో ప్రధాన పంట వేరుశనగ సాగుకు కూడా ఈనెల 15తో కాలం ముగిసిపోయింది. అయితే ఇంకా పూర్తి స్థాయి వివరాలు అందలేదని చెబుతున్నారు. తాజా నివేదిక ప్రకారం 20,900 హెక్టార్లకు గానూ 6 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. అలాగే 7 వేల హెక్టార్లలో సాగులోకి రావాల్సిన వరి ప్రస్తుతానికి వెయ్యి హెక్టార్లలో నాట్లు వేశారు. మిగతా పంటల విషయానికి వస్తే... జొన్న 3,800 హెక్టార్లు, మొక్కజొన్న 3,700 హెక్టార్లు, ఉలవ 3 వేల హెక్టార్లలో వేయగా సజ్జ, పెసర, మినుము, సోయాబీన్ తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగు చేశారు. డిసెంబర్ నెలాఖరుతో రబీ పంటలు విత్తుకునేందుకు సమయం ముగుస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు పంట నమోదు (ఈ-క్రాప్), ఈ-కేవైసీ ప్రక్రియ చురుగ్గా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి 50 శాతం ఈ-క్రాప్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

సర్కార్ పగ.. చిరుద్యోగులు దగా

- ఎంపీహెచ్‌ఏలను రోడ్డు పాలు చేసిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 58 మంది ఎంపీహెచ్‌ఏల తొలగింపు
- 22 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రకాల సేవలు
- నగం జీవితం పూర్తయిన తామెలా బతికేదంటూ ఆవేదన


తొలగింపు ఉత్తర్వులు చూపుతున్న ఎంపీహెచ్‌ఏలు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగాల కల్పన మాట ఎలా ఉన్నా... ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టి చిరుద్యోగుల నెత్తిన కూటమి సర్కార్ భస్మాసుర హస్తాన్ని మోపింది. వైద్య శాఖలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్‌ఏ–మేల్)ను ఉన్నఫలంగా తొలగించి రోడ్డు పాలు చేసింది. వైద్య శాఖను నిర్వీర్యం చేసే ఈ కుట్రలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 58 మంది బలయ్యారు.

అగమ్యగోచరమైన జీవితాలు..

ఉమ్మడి జిల్లాలో 143 మంది ఎంపీహెచ్‌ఏ (మేల్)లు పనిచేస్తుండగా వీరిలో 58 మందిని ఎలాంటి కారణాలు చూపకుండా ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని నమ్ముకున్న వారి కుటుంబాల జీవనం అగమ్యగోచరంగా మారింది. కుటుంబసభ్యుల పోషణ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు, పిల్లల విద్య, ఇంటి అద్దెలు ఎలా చెల్లించాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తొలగించిందనే విషయం బహిర్గతం కాగానే కనీసం అప్పులు కూడా పుట్టడం లేదు. ఇదే విషయాన్ని ఇటీవల రాష్ట్ర మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. 22 ఏళ్ల క్రితం 2002లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన తమను కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తామంతా 50 ఏళ్లు పైబడిన వయస్సులో ఉన్నామని, ఈ వయస్సులో తమకు ఎక్కడా ఉపాధి దొరకదంటూ విలపించారు.

6 నెలలుగా కొనసాగుతున్న తొలగింపులు..

కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత 6 నెలలుగా వివిధ శాఖల్లోని చిరుద్యోగులను తొలగించడమే పనిగా కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకూ ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు. రేషన్ డీలర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వైకేపీ యానిమేటర్లు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, వలంటీర్లు, పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్యం పని చేసే కార్మికులు తదితర చిరుద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. అమూల్ డెయిరీతో ఒప్పందాన్ని రద్దు చేసి వేలాది మంది యువతకు ఉపాధి లేకుండా చేశారు. అన్యాయానికి గురైన వారు మండల కేంద్రాలు, ఆర్డీఓ కార్యాలయాలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేసిన ఫలితం లేకపోయింది. వారి ఆవేదనను కనీసం పరిగణనలోకి కూడా ప్రభుత్వం తీసుకోలేదు.

గత ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు..

తొలగించబడిన ఎంపీహెచ్‌ఏలు దాదాపు 22 ఏళ్లుగా ప్రతి గ్రామం తిరిగి వివిధ రకాల సర్వేలు చేస్తూ వచ్చారు. ఫీవర్ సర్వే, జ్వర లక్షణాలు ఉన్న వారిని ఆసుపత్రులకు రెఫర్ చేయడం, వైద్యం అందించడం, మందులు ఇవ్వడం, రక్తనమూనాలు సేకరించడం, వాటిని ల్యాబ్‌లకు అందజేసి ఫలితాలు అందిపుచ్చుకున్న తర్వాత దగ్గరుండి మందులు అందజేయడం తదితర ఎన్నో విలువైన సేవలందించారు. అంటు, దోమకాటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకూ హెచ్‌ఆర్‌ఏ, డీఏలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించారు. వీరి దుస్థితిని గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023లో ఎంపీహెచ్‌ఏలోకు డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కూటమి సర్కార్ బేఖాతరు చేసింది.

ఎంపీహెచ్‌ఏల న్యాయ పోరాటం..

2002లో ఉద్యోగాల్లోకి తీసుకున్న ప్రభుత్వం 2012లో జీఓ నంబర్ 273 అమలులో భాగంగా తొలగించారు. అప్పట్లో ప్రభుత్వానికి విన్నవించుకోగా 1207 జీఓ ద్వారా తిరిగి 2017లో కొంత మందిని తీసుకున్నారు. కాగా, ఈ నెల 5న ఏకపక్షంగా ఉమ్మడి జిల్లాలోని 58 మందిని విధుల్లో నుంచి తొలగించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తొలగింపబడిన వెయ్యి మంది ఎంపీహెచ్‌ఏలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

నట్టేట ముంచారు



కరోనా సమయంలో రెండేళ్ల పాటు ప్రాణాలకు తెగించి పేదలకు సేవలందించాం. శాశ్వత ఉద్యోగులు భయాందోళనతో బయటకు రాలేకపోయారు. ఆ సమయంలో మేమే ముందుండి వైద్య సేవలు అందించాం. ప్రమోషన్లు వస్తాయని, హెచ్‌ఆర్‌ఏ, డీఏలు వర్తిస్తాయని ఆశించాం అయితే ఊస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనుకోలేదు. కూటమి పెద్దలను నమ్మినందుకు నట్టేట ముంచారు.

– మురళి, గుట్టూరు పీహెచ్‌సీ

తీరని అన్యాయం



గ్రామాల్లో పేదలకు 22 ఏళ్లుగా ఎన్నో విలువైన సేవలందించిన మమ్మల్ని తొలగించి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. 50 ఏళ్లు పైబడిన వయసులో మేము కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. వృద్ధులైన తల్లిదండ్రుల అవసరాలు, పిల్లల చదువులకు అవసరమైన డబ్బు ఎలా సమకూర్చుకోవాలి. – అజీజ్‌ఖాన్, పుట్టపర్తి పీహెచ్‌సీ

ఎలా బతకాలి



తొలగించబడిన ఎంపీహెచ్‌ఏలందరూ 50 ఏళ్లకు పైబడిన వారే. ఈ వయస్సులో ఏ కంపెనీలోనూ ఉద్యోగం రాదు. కుటుంబ పోషణ ఎలా అనేది తీవ్రంగా వేధిస్తోంది. చిరుద్యోగులపై ప్రతాపం చూపడం మంచి పద్ధతి కాదు. – నాగేగౌడ, ఆత్మకూరు పీహెచ్‌సీ

క్లుప్తంగా

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ అధికారి (చిత్రంలో) ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్

అనంతపురం: హోంగార్డుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నట్లు ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా తెలిపారు. ఈ నెల 6న ఎస్పీ పి.జగదీష్ హోంగార్డుల దర్బార్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు హోంగార్డులు తమ శాలరీ బ్యాంకు ఖాతాల మార్పు గురించి సమష్టిగా విన్నవించారు. హోంగార్డుల శాలరీ ఖాతాను యాక్సిస్ బ్యాంక్ నుంచి ఎస్‌బీఐకు మార్పు చేయాలని అప్పట్లో వారు కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో హోంగార్డుల శాలరీ ప్యాకేజీపై ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐలు మధు, రాముడు, ఎస్‌బీఐ అధికారులు వేణుగోపాల్, రాఫెల్ రాజు, నవీన మురహరి తదితరులు పాల్గొన్నారు.

కోడెదూడకు మలవాహిక శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ పద్మనాభం

శింగనమల: స్థానిక ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం పశువైద్యాధికారి డాక్టర్ పద్మనాభం ఓ కోడెదూడకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. నార్పల మండలం బి.పప్పూరు గ్రామ రైతు జనార్దన్‌రెడ్డికి చెందిన పాడి ఆవుకు ఇటీవల జన్మించిన కోడెదూడకు మలవాహిక లేదు. విషయాన్ని గుర్తించిన నార్పల పశు వైద్యులు వెంటనే శింగనమల ప్రాంతీయ పశు సంవర్ధక కార్యాలయానికి రెఫర్ చేశారు. పశువైద్యుడు డాక్టర్ పద్మనాభం పరిశీలించి, శస్త్రచికిత్స చేసి మలవాహికను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కోడెదూడ ఆరోగ్యంగా ఉంది. శస్త్రచికిత్సలో అంబులెన్స్ పశువైద్యులు డాక్టర్ సునీత, ట్రైనీ పశువైద్యురాలు నేహా, పారవెట్ ప్రసన్న, గీతా పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు తిమ్మప్ప

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో బుధవారం రచ్చుమర్రి గ్రామానికి చెందిన తిమ్మప్ప (50) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కట్టె బొగ్గుల ఉత్పత్తితో జీవనం సాగిస్తున్న తిమ్మప్ప ఇప్పటికే తాను సేకరించి ఉంచిన కట్టెలను ట్రాక్టర్లో తీసుకొచ్చేందుకు బుధవారం ఎన్.హనుమాపురం గ్రామానికి వెళ్లాడు. అయితే గ్రామ శివారులో ఆయన మృతి చెందడంతో కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాములకు నిప్పు


గడ్డిని వేరు పరుస్తున్న సర్పంచ్ వెంకటరమణారెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఆయన తమ్ముడు రామాంజులరెడ్డి వరి గడ్డి వాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమీపంలోని ఇళ్లలో వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో బాధిత రైతులు అక్కడకు చేరుకుని ఎగిసి పడుతున్న మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు బుధవారం ఉదయం సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

'అనంత'లో కూచ్‌బెహార్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం: బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కూచ్ బెహార్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ నెల 20న అనంతపురానికి ఇరు జట్ల క్రీడాకారులు చేరుకోనున్నారు. 20, 21 తేదీల్లో ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటారు. ఏపీ జట్టులో ప్రాతినిథ్యం వహిస్తున్న కేహెచ్ వీరారెడ్డి, ఎ.జయంత్‌కృష్ణ జిల్లా వాసులు కావడం గమనార్హం.

రైల్వే పోలీసులకు రాష్ట్ర స్థాయి అవార్డు


డీజీపీ ద్వారక తిరుమలరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ, అధికారులు

అనంతపురం సిటీ: గుంతకల్లు రైల్వే డివిజన్ పోలీసులకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ ద్వారక తిరుమలరావు నుంచి గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ మీనా, ఇతర అధికారులు అవార్డు అందుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్, నేర పరిశోధనలో ప్రతిభ చాటిన అంశానికి సంబంధించిగుంతకల్లు రైల్వే డివిజన్‌కు ద్వితీయ స్థానం దక్కింది. ఈ క్రమంలో అవార్డును డీజీపీ అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ మీనా, ఇన్‌చార్జ్ డీఎస్పీ హర్షిత, ధర్మవరం పూర్వపు సీఐ నాగరాజు, ప్రస్తుత సీఐ అశోక్‌కుమార్, గుంతకల్లు సీఐ నగేశ్‌బాబు, హిందూపురం రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు డి.రాజశేఖరరెడ్డి, శ్రీనివాసులు, కానిస్టేబుల్ జగదీశ్(అనంతపురం), గిరిప్రసాద్(హిందూపురం) ఉన్నారు.

చిలుకూరి లక్ష్మీదేవి కన్నుమూత


చిలుకూరి లక్ష్మీదేవి

అనంతపురం కల్చరల్: సుప్రసిద్ధ కథా రచయిత చిలుకూరి దేవపుత్ర సతీమణి, రచయిత్రి చిలుకూరి లక్ష్మీదేవి (65) కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలను బుధవారం అనంతపురంలోని క్రైస్తవ సమాధుల తోటలో నిర్వహించారు. ఆమెకు కుమారుడు అన్వేష్, కుమార్తె దీవెన ఉన్నారు. వీరిద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. బుధవారం ఉదయం అనంతపురంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న తన స్వగృహంలో కన్నుమూసిన లక్ష్మీదేవి భౌతిక కాయాన్ని పలువురు రచయితలు, కవులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న తదితరులు మాట్లాడుతూ రచయిత్రిగానే కాకుండా ఉత్తమ సాహితీ అభిమానిగా అనంత సాహితీలోకానికి చిలుకూరి కుటుంబసభ్యులు అందించిన సేవలను కొనియాడారు. జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, డాక్టర్ అంకె శ్రీనివాస్, షరీఫ్, చం. శాస్త్రి, రియాజుద్దీన్, రాజారామ్, రామాంజనేయులు, ఐద్వా సావిత్రి, డాక్టర్ ప్రగతి, జేవీవీ డాక్టర్ ప్రసూన, దత్తపీఠం తరపున డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు లక్ష్మీదేవికి నివాళులర్పించారు.

బకాయి 'ఫీజు'లు విడుదల చేయండి : ఏఐఎస్‌ఎఫ్


మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులకు బకాయి పడిన 'ఫీజు'లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతురాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 2,100 కోట్లు, వసతి దీవెన రూ. 1,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో పెండింగ్ ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ కళాశాలల యాజమాన్యాలు మెలిక పెట్టడంతో కోర్సు పూర్తయినా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రికి, విద్యాశాఖా మంత్రికి తెలిసినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చినా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తూనే ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే జీఓ 77 రద్దు చేస్తామని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింప చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చిన నారా లోకేష్ ఇప్పుడు ఆ జీఓపై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. వెంటనే జీఓ రద్దు చేయాలని, ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాధాజ్యోతి, జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ యాదవ్, వెంకట్ నాయక్, వంశీ, చందు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు సమీర్, వేణు, శ్యామ్, తరుణ్, అభిషేక్, తారక్, యశ్వంత్, కార్తీక్, జోసెఫ్, బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఖరితో విద్యా వ్యవస్థ నాశనం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న
- ఘనంగా ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీకి ఎంపికైన సభ్యులు

గుత్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో విద్యా వ్యవస్థ సర్వ నాశనమవుతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. గుత్తి శివారులోని మాసినేని ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజూ ఎస్‌ఎఫ్‌ఐ 32వ జిల్లా మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లికి వందనం, విద్యా దీవెన అమలుకు నోచుకోక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల కరెక్షన్ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ ప్రభుత్వాలు ముప్పతిప్పలు పెడుతున్నాయన్నారు. కరెక్షన్ కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టకుండా డబ్బు కోసం ఆధార్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, విద్యా వ్యవస్థను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ, విద్యార్థుల సమస్యలపై దశల వారీగా పోరాటాలు, ఉద్యమాలు చేస్తామన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

ఈ సందర్భంగా మొత్తం 25 మందితో కూడిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సిద్ధు, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, ఆఫీస్ బేరర్స్‌గా సి. రమేష్, వంశి, గిరి, శివ, రజిత, భీమేష్, వెంకి, సూర్య, కమిటీ సభ్యులుగా ధను, బాలాజీ, సోము, వీరేష్, మహేష్, జాకీర్, గౌతమ్ తదితరులు ఎంపికయ్యారు.

రైలు నుంచి జారి పడి బీటెక్ విద్యార్థి మృతి

ధర్మవరం రూరల్: మండలంలోని మల్లేనిపల్లి సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు... ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, సుధమ్మ దంపతుల కుమారుడు నిఖిల్‌కుమార్‌రెడ్డి (21) చెన్నైలోని ఓ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి స్వగ్రామానికి రైలులో బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున మల్లేనిపల్లి వద్ద ప్రయాణిస్తుండగా టాయిలెట్‌కని వెళ్లిన నిఖిల్... నిద్రమత్తులో బాతురూం తలుపు అనుకుని రైలు బోగీ డోర్ తెరిచి అడుగు ముందు కేయడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నిఖిల్‌కుమార్‌రెడ్డి తన సెల్‌ఫోన్‌ను తీసి విషయాన్ని తండ్రికి తెలుపుతూ లోకేషన్ షేర్ చేశాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిఖిల్‌కుమార్‌రెడ్డిని వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక సాయంత్రం ఆయన మృతి చెందాడు.

పొలంలోకి దూసుకెళ్లిన లారీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ – రంగాపురం క్యాంప్ గ్రామాల మధ్య ఓ లారీ బుధవారం సాయంత్రం పొలంలోకి వెనుక వైపుగా దూసుకెళ్లింది. ధాన్యం లోడుతో బయలుదేరిన లారీ స్థానిక అన్నపూర్ణ రైస్‌మిల్ వద్ద ఉన్న వేబ్రిడ్జి వద్ద కాటా వేసుకున్న అనంతరం డ్రైవర్ రివర్స్ చేస్తుండగా అదుపు తప్పి ఒక్కసారిగా పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

తిన మరిగి.. తిష్ట వేసి!

- యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో పాతుకు పోయిన కానిస్టేబుళ్లు
- ఎస్‌ఐలపైనే పెత్తనం
- అసాంఘిక శక్తులతో జట్టుకట్టి వసూల్ రాజాలుగా మారారనే విమర్శలు
- వసూల్ రాజాల దెబ్బకు తాజాగా ఎస్‌ఐ బలి


యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ఎస్‌ఐ కుర్చీ

యల్లనూరు: స్థానిక పోలీసు స్టేషన్‌కు గ్రహణం పట్టింది. ఏడాదిలోనే ఐదుగురు ఎస్‌ఐలు మారారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. స్టేషన్‌కు ఏ ఎస్‌ఐ వచ్చినా కొన్ని రోజులకే వీఆర్.. లేదా సస్పెన్షన్‌ను బహుమతిగా తీసుకెళ్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడి సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట అనే చందంగా వ్యవహరిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాల్సిన పోలీసులే మట్కా, పేకాటరాయుళ్లకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాతుకుపోయిన సిబ్బందితోనే..

యల్లనూరు పోలీసుస్టేషన్‌లో పాతుకుపోయిన కొందరు కింది స్థాయి సిబ్బంది ఎస్‌ఐలను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మట్కా, పేకాట, దుప్పటి పంచాయితీల్లో మామూళ్లు తీసుకుంటూ దందా నడుపుతున్నారు. ఎవరైనా ఎస్‌ఐ మట్కా, పేకాట వంటివి నియంత్రించాలని చూస్తే మామూళ్ల మత్తులో ఉన్న కానిస్టేబుళ్లు పక్కదారి పట్టించి ఆయనతో వాగ్వాదానికి దిగుతారనే విమర్శలున్నాయి. ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారిని కీలుబొమ్మలను చేసి కానిస్టేబుళ్లు రూ. లక్షలు సంపాదిస్తున్నారని, ఇదంతా బయటకు వస్తుందంటే అధికారిపై లేని పోని ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని తెలిసింది.

చిలమకూరు ఘటనలో సూత్రధారులెవరు?

యల్లనూరు మండలంలోని చిలమకూరు గ్రామంలో ఆంజనేయస్వామి జయంత్యుత్సవాల సందర్భంగా ఇటీవల పేకాటకు అనుమతించిన విషయం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే, స్టేషన్‌లో పనిచేసే ఇద్దరు కానిస్టేబుళ్లు... ఎస్‌ఐని బురిడీ కొట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'మీరు వెళ్లి పడుకోపోండి మేం ఉంటాం?' అంటూ ఎస్‌ఐని పంపి సదరు కానిస్టేబుళ్లు పేకముక్కల వ్యవహారం భారీగా నడిపించినట్లు సమాచారం. ఇందుకు గాను నిర్వాహకుడితో రూ.25 వేలు వసూలు చేసినట్లు తెలిసింది. అయితే ఇదొక్కటే కాదు మట్కా, పేకాట నిర్వాహకులు, ఇసుక అక్రమార్కులతో కలిసి దోపిడీ చేస్తున్నారన్నే ఆరోపణలున్నాయి.

ప్రజలను పట్టి పీడిస్తూ..

సమస్యలపై యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలనూ కానిస్టేబుళ్లు జలగల్లా పీక్కుతింటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌లో ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న వారు.. మండలంలోని ఏ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయో తెలుసుకుని మామూళ్లు దండుకుంటున్నారు.

విచారణ చేస్తాం

యల్లనూరు పోలీసు స్టేషన్‌లో ఇటీవల జరిగిన ఘటనపై దృష్టి సారించాం. చిలమకూరు జాతరలో పేకాటకు ఎవరు సహకరించారు? ఎంతమంది పోలీసు సిబ్బంది భాగస్వాములయ్యారనే వాటిపై విచారణ చేస్తాం. బాధ్యులపై చర్యలు తప్పవు. నివేదికను ఎస్పీకి పంపించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ అనంతపురం రూరల్

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- చదువు ఇష్టం లేక ఈ నెల 13న ఆత్మాహత్యయత్నం

శింగనమల: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఇద్దరూ శింగనమల మండలం లోలూరు క్రాస్ సమీపంలో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారు. 9వ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు చైతన్యకృష్ణ (17)కు చదువుకోవడం ఇష్టం లేదు. దీంతో తనను ఇంటికి పిలుచుకెళ్లాలని పలుమార్లు తల్లిదండ్రులను కోరుతూ వచ్చాడు. అయితే తల్లిదండ్రులు సర్ది చెపుతూ వస్తుండడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న బాలుడు... ఈ నెల 13న అదే పాఠశాల సమీపంలోని పొలాల్లో రైతులు గడ్డి మందు పిచికారీ చేసిన అనంతరం పడేసిన మందు బాటిల్‌ను హాస్టల్ గదిలోకి తీసుకెళ్లి అందులోని మిగిలిన మందును తాగాడు. అస్వస్థతకు గురైన విద్యార్థిని హాస్టల్ సిబ్బంది గుర్తించి వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు స్పందించకపోవడంతో బుధవారం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శరత్ చంద్ర తెలిపారు.

సిమెంట్ కర్మాగారంలో ప్రమాదం

- ఒకరి మృతి, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు


మృతుడు శివ, తీవ్రంగా గాయపడిన కార్మికుడు

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లి సమీపంలో ఉన్న సిమెంట్ కర్మాగారంలో బుధవారం రాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన శివ అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... కర్మాగారంలోని(హిలెన్ కూలర్) బొగ్గు లైన్‌లో పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా సుమారు 200 డిగ్రీల వేడితో ఉన్న ఇటుకలు కార్మికుల మీద పడ్డాయి. దీంతో శివ మృత్యువాత పడ్డాడు. నిట్టూరుకు చెందిన షణ్ముఖరెడ్డి, చింతలాయపల్లికి చెందిన గిరితో పాటు బీహార్‌కు చెందిన మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. షణ్ముఖ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు ప్రమాద స్థలిని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు.

క్లుప్తంగా

క్యాంటీన్ విస్తరణ పనులకు భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఏఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: జిల్లా పోలీసుల సంక్షేమంలో భాగంగా అనంతపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సీపీసీ (సెంట్రల్ పోలీస్ క్యాంటీన్) విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం అదనపు ఎస్పీలు డీవీ రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఏఆర్)లు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐ మగ్బూల్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, తేజీపాల్, ఆనంద్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఇది సెమీ కండక్టర్స్ యుగం'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుతం సెమీ కండక్టర్స్ యుగం నడుస్తోందని స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ అధ్యాపకురాలు ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం ఐటీఐలో 'స్కిల్ హవర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు ఉమాదేవి మాట్లాడుతూ విమానం నుంచి పిల్లలు ఆడుకునే ఎలక్ట్రానిక్ ఆట వస్తువుల వరకు సెమీ కండక్టర్లతోనే నియంత్రించబడుతున్నాయన్నారు. అధునాతన వైద్య రంగంలోనూ సెమీ కండక్టర్లను విరివిగా వాడి చెకప్‌లు చేస్తున్నారన్నారు. ఇండియా సెమీ కండక్టర్ల హబ్ కావాలంటూ స్వయంగా ప్రధాని ఆకాంక్షించారని గుర్తు చేశారు. అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ల తయారీలో వినియోగించి వాతావరణ అంశాల్ని విశదీకరిస్తున్నారన్నారు. విద్యార్థులు ఆ రంగంలో పయనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, ట్రైనింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డీ కంప్రెషన్ యూనిట్‌కు తాళం



యూనిట్‌కు తాళాలు వేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా మారుతీనగర్‌లో నిర్వహిస్తున్న డీ కంప్రెషన్ యూనిట్‌కు టౌన్ ప్లానింగ్ అధికారులు తాళాలు వేశారు. ఏసీపీ శ్రీనివాసులు, టీపీఓ శిరీష ఆదేశాలతో పట్టణ ప్రణాళిక కార్యదర్శి హీనా కౌసర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఏడాది కాలంగా నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా యూనిట్‌ను నిర్వహిస్తున్నారని, తక్షణం అనుమతులు తీసుకుని యూనిట్‌ను నిర్వహించుకోవాలని నోటీసులో పేర్కొన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏబీవీపీ నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ రంగనాయకులు, ఇన్‌చార్జ్ వి. శివ, కో ఇన్‌చార్జ్ ఎం. ప్రశాంత్ హాజరై నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఆర్. భరత్ కుమార్, కార్యదర్శిగా బి. చంద్ర నీల్ ఎంపికయ్యారు.

హతవిధీ.. ఇదేం దుస్థితి!

- స్టోర్ రూంలా మారిన ఐసీసీయూ
- పాత పడకలు, మరమ్మతులకు నోచుకోని పరికరాలు కుక్కుతున్న వైనం
- రోగుల అవస్థలు పట్టని వైద్యులు



సర్వజనాస్పత్రిలోని ఐసీసీయూలో చికిత్స పొందుతున్న రోగులు



బెడ్ల పక్కనే సామాన్లు ఉంచిన దృశ్యం

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో రోజు రోజుకు నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులతో బోధనాస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాక్షాత్తు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోని సర్వజనాస్పత్రిలో దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో అత్యంత కీలకమైన ఐసీసీయూ (మెడిసిన్ విభాగం) స్టోర్ రూంను తలపిస్తుండటమే ఇందుకు నిదర్శనం. విరిగిన మంచాలు, చెడిపోయిన పల్స్ ఆక్సీ మీటర్లు, ఆక్సిజన్ కాన్‌సెన్‌ట్రేటర్స్‌ను ఐసీసీయూలోనే ఓ మూలకు ఉంచారు. మరమ్మతులకు గురైన వాటిని వార్డుల్లో ఉంచితే ఇన్‌ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. 10 పడకలున్న ఐసీసీయూ ఇప్పుడు 7 పడకలకు చేరింది. రాష్ట్రంలో పేరొందిన కళాశాలల్లో బోధనాస్పత్రి ఒకటి. గుండె సంబంధిత సమస్యలున్న వారికి ఐసీసీయూలో ఉంచి సేవలందిస్తారు. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే రోజుకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇంతటి అత్యంత కీలకమైన యూనిట్‌లో సౌకర్యాలు మృగ్యంగా మారడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర కేసులను మేల్ మెడిసిన్, ఫీమేల్ మెడిసిన్ వార్డుల్లో ఉంచేస్తున్నారు. రోగుల పరిస్థితి క్షీణిస్తే ప్రైవేట్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది.

డ్రగ్ స్టోర్స్‌లో ఐసీసీయూ మంచాలు..

సర్వజనాస్పత్రిలోని డ్రగ్ స్టోర్‌లో ఐసీసీయూ మంచాలు పుష్కలంగా ఉన్నాయి. కాగా వాటిని మూలకు పడేశారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో మంచాలను ఏర్పాటు చేయడంలో సర్వజనాస్పత్రి అధికారులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులు వార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. ఆస్పత్రిలో మొదటి ఫ్లోర్‌లో ఉన్న ఐసీసీయూ స్టోర్ రూంను తలపిస్తున్నా..అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



రంగారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: కుంటిమద్ది గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి (65) గుండె పోటుతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం కుంటిమద్దికి చేరుకునిమృతదేహానికి వాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, పార్టీ మండల మాజీ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

- మేయర్ వసీం



ముస్లిం శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: హెచ్ఎల్‌సీ కెనాల్ సమీపంలో ఉన్న ముస్లిం శ్మశాన వాటిక వద్ద ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. బుధవారం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి శ్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని శ్మశాన వాటికల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అశోక్‌నగర్‌లోని ముస్లిం శ్మశాన వాటికకు రూ.67 లక్షలతో ప్రహరీ, రూ.17 లక్షలతో లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నవోదయ కాలనీ హిందూ శ్మశాన వాటికలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మేయర్ వెంట కార్పొరేటర్లు మునిశేఖర్, సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, ఈఈ రాధాకృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప..



ప్రత్యేక అలంకరణలో హరిహరసుతుడు



హారతి ఇస్తున్న మాలధారులు, మహిళలు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మాలధారుల శరణుఘోషతో రామాలయం మార్మోగింది. మొదటిరోడ్డులోని శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భారీ ఎత్తున గ్రామోత్సవం సాగింది. కో ఆప్షన్ మెంబర్ లక్ష్మీరెడ్డి బృందం ఆధ్వర్యంలో వందలాది మంది అయ్యప్పలు నగరవీధుల్లో ఆనంద పరవశంతో స్వామివారి ఊరేగింపులో నామస్మరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు జ్యోతులతో శోభాయాత్రకు స్వాగత నీరాజనాలర్పించగా శ్రీకాశీవిశ్వేశ్వరాలయం నుంచి పురవీధుల్లో హరిహరసుతుడు దర్శనమిచ్చాడు. భజనల అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు కొత్రపాటి శ్రీనివాసులు, మహేష్, రాజశేఖర రెడ్డి , మణికంఠ స్వామి, మాజీ ఆలయ చైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక అంబేడ్కర్ నగర్‌లో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా సాగింది. అయ్యప్పస్వామి రామ భక్తమండలి వారి ఆధ్వర్యంలో వందలాది మంది అయ్యప్పలు పడిమెట్లను తీర్చిదిద్ది సామూహిక భజనలు చేశారు. మధ్యాహ్నం సామూహిక భిక్ష, సాయంత్రం గురుస్వామి ప్రసాద్ నంబూద్రి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నగరోత్సవం సాగింది. విద్యుద్దీప అలంకరణలతో పూల రథంపై ఊరేగిన మణికంఠుడిని భక్తులు దర్శించుకున్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో పూజలందుకున్న స్వామివారు



అయ్యప్పస్వామి నగరోత్సవంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు

పోటీలతో నైతిక విలువల పెంపు

- డీఈఓ ప్రసాద్‌బాబు



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం కల్చరల్: భక్తిభావం పెంచే పోటీలు చిన్నారుల్లో నైతిక విలువల పెంపునకు దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ప్రసాద్ బాబు అన్నారు. అనంతపురం వేదికగా జనవరి 4న భారీ ఎత్తున జరగనున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ ప్రచారాన్ని బుధవారం డీఈఓ, స్కూల్ యాజమాన్యాల ప్రతినిధులు ప్రారంభించారు. స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన కార్యక్రమంలో భాగంగా పవన యువజన సేవా ట్రస్టు వారి ఆధ్వర్యంలో వ్యక్తిగత, గ్రూపు విభాగాలలో పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 56 పాఠశాలల చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పఠనం వంటి ఆధ్యాత్మికతను పెంచే పోటీలు విద్యార్థులను ఉన్నతంగా మారుస్తాయన్నారు. తల్లిదండ్రులు చిన్నారులను భాగస్వాములయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమాలు విజయవంతం కావడానికి తమ వంతు సహకారమందిస్తామని ఆచార్య సుధాకర బాబు, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల ప్రతినిధులు పుల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవికుమార్, శ్రీనాథ్, నాగరాజు, రవిచంద్రారెడ్డి, విద్యార్థి సంఘం నేత ఆకుల రాఘవేంద్ర, చాలీసా ప్రచార సమితి సభ్యులు మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న నెహమ్యా నాగరాజు



హాజరైన క్రైస్తవులు

రాప్తాడురూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డివారి నెహమ్యా నాగరాజు అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. మేరీ మేరీ క్రిస్మస్..హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అంటూ క్రైస్తవులు పెద్ద ఎత్తున నినదించారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు, భజనలు, గీతాలాపనలు చేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, హైదరాబాద్ ఎవెంజెలిస్ట్ పాస్టర్ గాడ్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాస్టర్ గాడ్లి మాట్లాడుతూ దేవాదిదేవుడు మానవరూపిగా ఈ లోకంలో జన్మించారన్నారు. దైవ సేవకులు విశ్వాసాన్ని కలిగి ఉండాలన్నారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ క్రైస్తవ ఉనికిని కాపాడేందుకు నెహమ్యా నాగరాజు విశేష కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పాస్టర్లు, పేదలకు బ్యాగులు, బియ్యం, కానుకలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, కాటిగానికాలువ జనార్దన్‌రెడ్డి, పాస్టర్లు మార్కు, నవీన్‌కుమార్, వి.మనషే, జీఆర్ ఆనంద్, జీవన్‌బాబు, రూఫస్‌కుమార్, శాంతవర్ధన్, జహంగీర్ జాషువా, లాబాన్, బిందెల రాజు, విశ్వాస్, జీవ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలతో ఉత్తమ జీవితం

అనంతపురం కల్చరల్: క్రీస్తును విశ్వాసంతో ఆరాధించే వారికి ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని అంతర్జాతీయ ప్రసంగీకులు రెవరెండ్ బి.గాడ్లీ అన్నారు. ఏటా అనంతలోని ప్రార్థనా మందిరాలన్నీ కలిపి క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు బుధవారం చైర్మన్ వరప్రసాద రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. స్థానిక అశోక్ నగర్‌లోని అంబేడ్కర్ భవన్ వేదికగా సాగిన వేడుకలకు హైదరాబాద్‌కు చెందిన గాడ్లీ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ నుంచి ప్రతినిధులు ఆత్మీయ అతిథులుగా హాజరై వాక్యోపదేశం చేశారు. అంతకు ముందు రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఐక్య క్రిస్మస్ వేడుకల కన్వీనర్ క్రాంతి జాన్‌వెస్లీ, ఏఐసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి డేనియల్, జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్‌రావు, క్రైస్తవ కమ్యూనిటీ లీడర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిప్యూటేషన్ పద్ధతిలో నియమించే ఏపీఓ, ఏఎస్ఓ పోస్టుల్లో రిజర్వేషన్ ఉపాధ్యాయులైన ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఈఎఫ్ రాష్ట్ర నాయకులు జీవీ ఉజ్వల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీఓ పోస్టుకు ఎస్జీటీ, ఏఎస్ఓ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌ను తీసుకుంటారని పేర్కొన్నారు. కేవలం పలుకుబడి ఉన్న వారిని, అగ్రవర్ణాలకు చెందిన టీచర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని వాపోయారు. ప్రతిభతో సంబంధం లేకుండా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో భర్తీ చేస్తున్నారన్నారు. ఇప్పటిదాకా 90 శాతానికి పైగా కేవలం రెండుమూడు సామాజిక వర్గాలకు చెందిన టీచర్లనే ఈ పోస్టుల్లో నియమించారన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులకు మాత్రమే లోపాయికారిగా సాయమందిస్తూ అవినీతి అక్రమాలకు ఊతమిస్తున్నారని ఆరోపించారు. సామాజిక న్యాయం జరిగేలా నియామకాలు జరపాలని ఉజ్వల్ డిమాండ్ చేశారు.

16 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో పీవీకేకే కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: పీవీకేకే బాలాజీ ఫార్మసీ కళాశాలలో హెటిరో ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 16 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు తెలిపారు. గ్లోబల్ మార్కెట్‌లో సత్తా చాటుతూ నాణ్యమైన ప్రమాణాలు, పరిశోధన పరంగా అభివృద్ధి చెందుతున్న సంస్థలో ఉద్యోగాలు లభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణకిశోర్ అభినందించారు.

క్రీడలతోనే మానసిక, శారీరక వికాసం

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం సాధ్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 600 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే కాసేపు వాలీబాల్ ఆడారు. పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల బోణీ



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో బుధవారం ఎస్కేయూ అంతర కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఎస్వీ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల మధ్య జరిగిన పోరులో ఎస్వీ డిగ్రీ కళాశాల 17 పరుగుల తేడాతో గెలుపొందింది. నిర్దేశించిన 20 ఓవర్లకు గాను ఆరు వికెట్ల నష్టానికి 195 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌జీఎస్ జట్టు 178 పరుగులకు ఆలౌట్ అయింది. లోహిత్ 84 పరుగులు, షాహిద్ 102 పరుగులు చేసి జట్టు గెలుపునకు కృషి చేశారు. రెండో మ్యాచ్‌లో శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధ్య జరగ్గా, శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ సి. చక్రధర్ రెడ్డి, సెక్రటరీ ఎం. శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ అవస్థలు!

- 24 గ్రామాలకు ఒకే డిజిటల్ అసిస్టెంట్
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు
- ఆధార్ లేకపోతే లబ్ధిదారుగా గుర్తించని పోషణ ట్రాకర్



ఒక్క డిజిటల్ అసిస్టెంట్‌తోనే ఆధార్ నమోదు



సాయంత్రం 4 గంటలు దాటినా ఆధార్ కోసం వేచి ఉన్న చిన్నారులు, తల్లిదండ్రులు

ఆత్మకూరు: చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. చిన్నారులు ఆకలితో అలమటిస్తున్నా క్యూలో నుంచి పక్కకు కదలలేని పరిస్థితి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 0–5 ఏళ్ల లోపు పిల్లలకు అందించే పౌష్టికాహారం పొందాలంటే ఆధార్ తప్పనిసరి. అయితే తగినన్ని కేంద్రాలు లేక ఆధార్ నమోదుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. ఐసీడీఎస్ ఆత్మకూరు సెక్టారు పరిధిలో 31, సనప సెక్టార్ పరిధిలో 16 మొత్తం 47 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,467 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేయాల్సి ఉంది. ఈ నెల 18 నుంచి 20 వరకు చిన్నారుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే మండలంలోని 24 గ్రామాలకు కలిపి ఇక్కడ ఒకే ఒక్క డిజిటల్ అసిస్టెంట్ ఉన్నారు. మూడు రోజుల్లో ఇంతమంది చిన్నారులకు ఎలా పూర్తి చేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో సెక్టారుకు ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్ల చొప్పున రెండు సెక్టార్లకు మొత్తం ఆరుగురిని నియమిస్తే పిల్లలకు ఆధార్ ప్రక్రియ పూర్తవుతుందని అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన చిన్నారుల ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రానికి తోపుదుర్తి, సనప, రంగంపేట, బి.యాలేరు గ్రామాల నుంచి రావాలంటే దాదాపు 60 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. చాలా గ్రామాలకు బస్సులు, ఆటోల సదుపాయం లేనందున ద్విచక్రవాహనాల్లో వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నమోదు కేంద్రం వద్ద గంటల తరబడి క్యూలో ఉన్నపుడు చిన్న పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారని మండిపడుతున్నారు. ఆధార్ లేకపోతే పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారులుగా నమోదవదని.. పిల్లలు పౌష్టికాహారం పొందలేరని తెలిపారు.

వంద రోజులు 'ఉపాధి' కల్పించండి

ఆత్మకూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకీ ఉపాధి హామీ కింద వంద రోజులు పని కల్పించాలని ఏపీడీ అనురాధ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూలీల బిల్లులు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. అంతేకాకుండా ఆవుల షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. హార్టికల్చర్ పంటలు, వాటి పనులు, బిల్లుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏపీఓ సుజాత, ఈసీ భాస్కర్, హౌసింగ్ ఏఈ జమీల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల తగ్గింపునకు కృషి

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లో ఉన్న పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో సౌర విద్యుదుత్పత్తిని అందుబాటులోకి తెచ్చి విద్యుత్ బిల్లులను తగ్గించేలా కృషి చేయాలని మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తీర్మానించారు. వీఎంసీ చైర్ పర్సన్, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్కండేయ సూరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠశాల అభివృద్ధి, పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని వివరించారు. అనంతపురం నుంచి వస్తున్న పాఠశాల విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.